క్లుప్తంగా

రేపు మండల సమావేశం

రాజవొమ్మంగి: మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో యాదగిరీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు అందరిని ఆహ్వానిస్తున్నామన్నారు. అన్నిశాఖల ప్రభుత్వ అధికారులు పూర్తి సమాచారంతో విధిగా హాజరుకావాలని కోరారు. ప్రస్తుతం ఎన్నికల నియమావళి అమలులో ఉందని, రాజకీయపరమైన అంశాలు చర్చకు తీసుకొని రావద్దని సూచించారు.

ఏకలవ్యలో నూరుశాతం ఉత్తీర్ణత


ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ గ్రామ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఈ ఏడాది 10, 12 తరగతుల్లో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్టు మంగళవారం ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ తెలియజేశారు. పదో తరగతిలో సెంట్రల్ సిలబస్‌తో 77 మంది, 12వ తరగతిలో 82 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా నూటికి నూరు శాతం ఉత్తీర్ణులైనట్టు ఆయన తెలిపారు. సెంట్రల్ సిలబస్ అయినప్పటికీ మంచి మార్కులు సాధించినట్టు చెప్పారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణతో పాటు ఆపాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

బీజేపీ నేత మృతికి సంతాపం


నీలంబరం(ఫైల్)


ముంచంగిపుట్టు: మండలంలో గల వనభసింగి పంచాయతీ టొంగికోట గ్రామానికి చెందిన బీజేపీ మండల నేత కిలో నీలంబరం అలియాస్ రామో (44) అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం సాయంత్రం ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగా మారి కన్ను మూశారు. ఆయన మృతికి స్థానిక మోటార్ యూనియన్ నేతలు, బీజేపీ నాయకులు తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

భానుడి భగభగ


ఎండతో గొడుగుల చేతపట్టి వ్యాపారం చేస్తున్న చిరు వ్యాపారులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో రోజురోజుకు ఎండలు పెరుగుతున్నాయి. ఎండ వేడికి ప్రజలంతా విలవిల్లాడుతున్నారు. గత కొన్ని రోజులుగా చల్లబడ్డ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఎండ వేడికి మండల వాసులు గొడుగులు పట్టుకునే బయటకు రావాల్సిన పరిస్థితి నెలకొంది. చిరువ్యాపారులు సైతం ఎండవేడికి తట్టుకోలేక గొడుగులు పట్టుకొని వ్యాపారం చేస్తున్నారు. భానుడి ప్రతాపంతో శీతలపానీయాల అమ్మకాలు జోరందుకున్నాయి.మధ్యాహ్నం పూట బయటకు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. మంగళవారం ఎండ తీవ్రతతో జనం నానా అవస్థలు పడ్డారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సర్పంచ్ రమేష్

ముంచంగిపుట్టు: క్రమశిక్షణ ,నిరంతర సాధనతోనే క్రీడల్లో రాణిస్తారని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంగడ రమేష్ అన్నారు. మండలంలోని సుజనకోట పంచాయతీ సుజనపేట గ్రామంలో వచ్చే నెల 3న గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి పండుగను పురస్కరించుకొని మండల స్థాయి క్రికెట్ పోటీలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రమేష్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. మొదటి మ్యాచ్‌లో పాల్గొనే గాదెలబురుగు, సుజనపేట-బి జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడాకారుల్లో ఆత్మవిశ్వాసం, పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చన్నారు. గిరిజన యువతలో అపారమైన ప్రతిభ ఉందని, దానిని సానబెట్టి ముందుకు సాగితే వారి భవిష్యత్తు బంగారు బాటవుతుందన్నారు. ముఖ్యంగా చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆయన కోరారు. గ్రామస్తుడు బి.బి.దామోదరం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో దారెల



నాడు-నేడు ద్వారా అభివృద్ధి చెందిన ఢీంబుగూడ పాఠశాల


దారెల నుంచి ఢీంగూడ రోడ్డు



దారెలలో రైతు భరోసా కేంద్రం

- మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న గిరిజనులు


తరగతి గదిలో పాఠాలు అభ్యసిస్తున్న విద్యార్థులు

ముంచంగిపుట్టు: అభివృద్ధి, సంక్షేమ ఫలాలు చిట్టచివరి లబ్ధిదారులకూ అందాలని, గ్రామాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయలు కల్పించాలని, గ్రామాల్లో జనం బాగుండాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం. గడిచిన ఐదేళ్ల పాలనలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి గిరిజన గ్రామాల స్థితిగతులనే మార్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది. ముంచంగిపుట్టు మండలం దారెల పంచాయతీలో 14 గిరిజన గ్రామాలున్నాయి. 2357 మంది జనాభా నివస్తున్నారు. ఒకప్పుడు ఏ చిన్న పనికైనా మండల కేంద్రానికి పరుగులు పెడితే గాని పనులు జరిగేవి కావు. పంచాయితీ కేంద్రంలోనే సచివాలయ వ్యవస్థ ద్వారా పనులు జరుగుతున్నాయి. రైతులకు కూడా ప్రభుత్వ సేవలు నేరుగా అందేందుకు రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఫలితంగా రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.వ్యవసాయంలో మెలుకువలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.నాణ్యమైన విత్తనాలు రైతులకు అందిస్తున్నారు.రైతు భ రోసా పేరుతో పెట్టుబడి సహాయం అందిస్తున్నారు.

మారిన గ్రామాల రూపురేఖలు

గిరిజన రైతులకు వ్యవసాయంలో సూచనలు, సలహాలు నిమిత్తం 20లక్షలతో దారెలలో రైతు భరోసా కేంద్రం నిర్మించారు. డింబుగూడ గ్రామంలో నాడు-నేడు ద్వారా రూ.26లక్షలతో ఎంపీపీ స్కూల్ రూపురేఖలు మార్చారు. మరుగుదొడ్లు, తాగునీరు, వంటషెడ్డును నిర్మించారు. దీనిపై డింబుగూడ గ్రామ గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.జెడ్పీ నిధులు 5లక్షలతో దారెల పంచాయితీ కేంద్రంలో 100 మీటర్ల సీసీ రోడ్డు వేశారు.జెడ్పీ నిధులు 2లక్షల50వేలతో వరడపుట్టులో 30మీటర్ల సీసీ రోడ్డు,2లక్షల50వేలతో పేటమాలిపుట్టులో 20మీటర్ల సీసీ రోడ్డు,లక్ష30వేలతో బోరును వేశారు.దారెల,డి.కుమ్మరిపుట్టు,పేటమాలిపుట్టు గ్రామాల్లో ఎంపీటీసీ నిధులు 3లక్షల90వేలతో బోర్లు వేశారు.దారెల పంచాయితీ కేంద్రం నుంచి డింబుగూడ మీదగా డొక్రిపుట్టు వరకు 5కిలోమీటర్ల తారురోడ్డును 2కోట్ల75లక్షలతో వేశారు.వరడపుట్టు నుంచి కోడాపుట్టు,డింబుగూడ నుంచి పనస,పేదపేట నుంచి మాలిపుట్టు వరకు రహదారి పనులు జరుగుతున్నాయి.మాలిపుట్టు గ్రామ సమీపంలో 48లక్షలతో వంతెనను నిర్మిస్తున్నారు.46లక్షలతో గ్రామ సచివాలయం,13లక్షలతో వెల్‌నెస్ సెంటర్ నిర్మాణాలు జరుగుతున్నాయి. పంచాయతీలో డి.కుమ్మరిపుట్టు, రంగెలిసింగి, చికుచింత, దారెలలో మొత్తం ఐదు సెల్ టవర్ల వేయడంతో సమాచార వ్యవస్థ పూర్తిగా గిరిజన గ్రామాలలోకి అందుబాటులోకి వచ్చింది.గతంతో పోలిస్తే దారెల పంచాయతీలో అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కలగడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మెరుగైన సదుపాయాలు



గతంతో పోలిస్తే మా పంచాయితీలో మౌలిక సదుపాయాలు మెరుగుపడ్డాయి. దారెల పంచాయితీ మొత్తం సమాచార వ్యవస్థ వచ్చింది.ఆర్‌బీకే పూర్తయి అందుబాటులోకి వచ్చింది.సచివాలయం, వెల్‌నెస్ సెంటర్‌ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రతి గ్రామానికి తాగునీటి బోర్లు వేయడం,నీటి పథకాలు ఏర్పాటు చేయడం జరిగింది.డింబుగూడ పాఠశాలను నాడు-నేడుతో రూపురేఖలే మార్చారు .విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించాం. ఆనందంగా ఉంది.

– పాంగి మల్లికార్జున్, ఎంపీటీసీ, దారెల పంచాయతీ, ముంచంగిపుట్టు మండలం

ఆర్‌బీకేలతో చాలా మేలు జరుగుతోంది



ప్రభుత్వం రైతులకోసం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఎంతగానో ఉపయోగపడతున్నాయి. వ్యవసాయంలో మెలకువలపై రైతులకు ఆర్‌బీకేలో సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రైతులకు అందిస్తున్నారు. తద్వారా పంటలకు మాకూ ఎంతగానో మేలు జరుగుతోంది. హైరింగ్ పద్ధతిలో వ్యవసాయ యంత్రాలను అందిస్తున్నారు. ఆర్‌బీకేలు రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

– పి.పులిరాజు, దారెల పంచాయతీ, ముంచంగిపుట్టు మండలం

సమస్యాత్మక గ్రామాల్లోనూ పోలింగ్ సక్సెస్


జి.మాడుగులలో విలేకరులతో మాట్లాడుతున్న సీఐ రమేష్

జి.మాడుగుల: స్థానిక సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల మూడు పోలీస్ స్టేషన్ల అధ్వర్యంలో సమస్యాత్మక గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు, గొడవలు లేకుండా పోలింగ్ ప్రశాంతగా జరిగినట్టు సీఐ రమేష్ తెలిపారు. జి.మాడుగుల సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక పోలీస్ సర్కిల్ అధ్వర్యంలో గల పెదబయలు, ముంచంగిపుట్టు, జి.మాడుగుల మండల పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు, సమస్యాత్మక గ్రామాల్లో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయన్నారు. జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ ఆదేశాల మేరకు గ్రామాల్లోను అనుమానిత ప్రాంతాల్లో గత 3 నెలలు నుంచి ప్రణాళిక బద్ధంగా ముందస్తుగా పోలీసుల తనిఖీలు, ఎన్నికల నియమావళిపై నిర్వహించిన ప్రజా అవగాహన సభలు, సమావేశాలు సత్ఫలితాలు వచ్చినట్టుగా భావిస్తున్నట్టు ఆయన చెప్పారు. గత ఎన్నికల పోలింగ్ కంటే ఈ పోలింగ్‌కు దూర ప్రాంతాల నుంచి ఓటర్లు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, ఫలితంగా ఓటింగ్ శాతం పెరిగిందన్నారు. జి.మాడుగుల మండలంలో రాసవీధి, కిల్లంకోట, మద్దిగరువ,బొయితిలి, కోరాపల్లి, కిటుముల, లువ్వాసింగి, అలగాం గ్రామాలు, పెదబయలు మండలం ఇంజరి, గిన్నెలకోట, గొమంగి గ్రామాలు, ముంచంగిపుట్టు మండలంలో లక్ష్మీపురం, బూసిపుట్టు, బుంగపుట్టు, మద్దులబంద మావోయిస్టు, సమస్యాత్మక గ్రామాల్లో గతం కంటే పోలింగ్ శాతం పెరిగిందని ఆయన వివరించారు. ప్రజల సహకారంతో ఎన్నికలు సజావుగా ప్రశాంతంగా జరిగాయన్నారు.అరకు పార్లమెంట్ పరిధిలో గల పాడేరు, అరకు అసెంబ్లీ నియోజవర్గాల పరిధిలో గల పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఎన్నికల నిర్వహణలో ప్రశాంతంగా జరగడానికి జి.మాడుగుల, పెదబయ లు, ముంచంగిపుట్టు ఎస్ఐ శ్రీనివాస్, మనోజ్, రవీంద్రల శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అహర్నిశలు విధులు నిర్వర్తించారని వారిని అభినందించారు. సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జి.మాడుగుల మండలంలో 29,026ఓట్లు పోలవ్వగా-47.33శాతం, ముంచంగిపుట్టులో 26,645ఓట్లు- 70.64 శాతం, పెదబయలులో 27,710ఓట్లు- 66.03 శాతం పోలింగ్ నమోదయ్యినట్టు ఆయన చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగటానికి కృషి చేసిన సీఆర్‌పీఎఫ్ బలగాలు, పోలీస్‌శాఖ సిబ్బంది, సహకరించిన ప్రజలకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఎస్ఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటెత్తిన మహిళా లోకం

అనంతగిరి/పాడేరు/రంపచోడవరం: అల్లూరి జిల్లాలో సోమవారం జరిగిన 2024 సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. అరకులోయ, పాడేరు, రంపచోడవరం నియోకవర్గాల్లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సజావుగా సాగింది. పోలీసులు, సాయుధ దళాలు, సీఆర్‌పీఎఫ్ బలగాలు ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. మునుపెన్నడూ లేనంతగా ఓటర్లు తరలివచ్చారు. ప్రత్యేకంగా శివారు గ్రామాల నుంచి గిరిజన మహిళలు తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం నుంచి ఓటింగ్ పెరిగింది. కొన్ని చోట్ల సాయంత్రం 4గంటలు దాటినా ఓటర్లు క్యూలో ఉండడంతో వారికి ఓటు వేసేందుకు అధికారులు అనుమతిలిచ్చారు. ఉదయం ఎండ, ఉక్కపోత, మధ్యాహ్నం నుంచి కురిసిన భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పోలింగ్ కేంద్రాల ఓటర్లు ఓటు వేసేందుకు బారులు తీరారు.


బంధవీధిలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు


మోతుగూడెంలో బారులు తీరిన ఓటర్లు

అల్లూరి జిల్లాలో 2024 పోలింగ్ సరళి వివరాలు
(సాయంత్రం 4గంటల వరకు)

మండలం	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓటర్లు	పోలింగ్ శాతం
పాడేరు నియోజకవర్గం..			
పాడేరు	304	248387	63.9
జి.మాడుగుల	61	29026	47.33
కొయ్యూరు	56	43000	67
గూడెం కొత్తవీధి	45	50000	55
చింతపల్లి	78	40902	58
అరకు నియోజకవర్గం..			
ముంచంగిపుట్టు	50	38,486	68.9
పెదబయలు	49	42,863	64.6
హుకుంపేట	55	45,380	72.6
డుంబ్రిగుడ	48	38,536	76.3
అరకులోయ	56	42,494	75.1
అనంతగిరి	46	37,730	68.9
రంపచోడవరం నియోజకవర్గం..			
అడ్డతీగల	42	30862	56.07
చింతూరు	40	30313	76
దేవీపట్నం	29	21062	68.83
గంగవరం	37	21955	79.03
కూనవరం	25	20362	54.20
మారేడుమిల్లి	29	15257	72.27
రంపచోడవరం	43	29875	72.69
రాజవొమ్మంగి	52	32000	76
వి.ఆర్.పురం	29	19953	65.98
వై.రామవరం	31	21192	67
ఎటపాక	42	33409	77

గ్రామాల్లో వైద్య శిబిరాలు


జోలాపుట్టులో వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారి ప్రతాప్, సిబ్బంది


అమీనాబాద్‌లో రోగులను పరీక్షిస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని లబ్బూరు వైద్యాధికారి ప్రతాప్ అన్నారు.మండలంలోని జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలో మంగళవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 88 మందికి వైద్య సేవలు అందించారు. జ్వరాలతో బాధపడుతున్న అయిదుగురికి రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఆరోగ్య వివరాలు సేకరించారు, మలేరియా, డయేరియా, టైఫాయిడ్, టీబీ తదితర వ్యాధులపై గ్రామాల్లో గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ప్రతాప్ మాట్లాడుతూ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, అనారోగ్యమైతే వెంటనే వైద్యులను సంప్రదించాలని, ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం చేయరాదని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని గ్రామస్తులకు సూచించారు. లబ్బూరు వైద్య సిబ్బంది తులసిరావు, భాగ్యవతి, కృష్ణవేణి పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని అమీనాబాద్ గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో 65 మంది రోగులను పరీక్షించి అవసరమైన చికిత్స అందజేసినట్లు డాక్టర్ నాగార్జున తెలిపారు. మందులు పంపిణీ చేశామన్నారు. బీపీ, సుగర్ సమస్యలు ఉన్న వారికి పరీక్షలు చేసి తగిన సూచనలిచ్చినట్టు తెలిపారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక చికిత్స అందజేశామన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ కుమారి, హెచ్.వి.చిన్నయమ్మ, రమణ, ఏఎస్ఎం మల్లేశ్వరి, 104 డీఈఓ శ్రీనివాస్, ఆశ పాల్గొన్నారు.

పూతదశలో బరబాటి సాగు


రామచంద్రపురంలో బరబాటి సాగు

కె.కోటపాడు: మండలంలోని మెట్ట ప్రాంత గ్రామాల్లో బరబాటి సాగు ఆశాజనకంగా ఉంది. మూడు నెలల కాలంలో చేతికందివచ్చే పంట కావడంతో బరబాటిని రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో సాగవుతున్న బరబాటి పంట ప్రస్తుతం పూతదశలో ఉంది. నీటి లభ్యత ఉన్న పొలాల వద్ద కింతాడ, జోగన్నపాలెం, రామచంద్రపురం, మర్రివలస, లంకవానిపాలెం, పింద్రంగి, కె.సంతపాలెం, ఆర్లి, ఎరకన్నపాలెం, దాలివలస, కె.సంతపాలెం గ్రామాల్లో 40 ఎకరాలలో సాగు చేస్తున్నారు.

ఘనంగా పరదేశమ్మ పండగ

రోలుగుంట: కోమరవోలులో పరదేశమ్మ పండగను గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం గ్రామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆకాశం మిరుమిట్లు గొలిపేలా బాణసంచా కాల్చారు.

చౌడువాడలో వైభవంగా చినపైడితల్లమ్మ పండగ


చెక్క గుర్రాల ఊరేగింపులో గ్రామస్తులు

కె.కోటపాడు: చౌడువాడలో చిన పైడితల్లమ్మ పండగ మంగళవారం ఘనంగా జరిగింది. ఇక్కడ అమ్మ వారి పండగ పర్వదినం కావడంతో ఉదయం నుంచే పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పండగలో భాగంగా సాయంత్రం చెక్క గుర్రాలను గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. బంధువులు, స్నేహితుల రాకతో గ్రామమంతా సందడి వాతావరణం నెలకొంది.

నేడు గౌరీపరమేశ్వరుల ఆలయ వార్షికోత్సవం

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ ప్రతినిధి గరికి వెంకటరావు, మద్దాల కూర్మారావు మంగళవారం తెలిపారు. మెయిన్‌రోడ్డు రహదారి విస్తరణలో సుమారుగా 15 సంవత్సరాల క్రితం అమ్మవారి ఆలయాన్ని తొలగించారని, ఆలయ వెనుకభాగాన ఉన్న స్థలం వ్యక్తి సాయంతో అమ్మవారి గర్భగుడిని మూడు సంవత్సరాల పునఃనిర్మించినట్టు చెప్పారు.

ఎం.కె.వల్లాపురంలో గ్రీన్ పోలింగ్ స్టేషన్

మాడుగుల రూరల్ : చోడవరం సామాజిక ఆటవీశాఖ ఫారెస్టు రేంజ్ అధికారి గౌరీష్ ఆధ్వర్యంలో పోలింగ్ స్టేషన్లను గ్రీన్ పోలింగ్ స్టేషన్లుగా మార్పు చేశారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మండలంలో ఎం.కె. వల్లాపురం పోలింగ్ స్టేషన్ గల ఎంపీపీ పాఠశాలలో చలువ పందిళ్ల ఏర్పాటు చేశారు. ఓటర్లకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేశారు. అలాగే రేంజ్ పరిధిలో చోడవరం మండలంలో పి.ఎస్ పేట గ్రామంలో గల పోలింగ్ కేంద్రంలో కూడా చలువ పందిళ్ల ఏర్పాటు చేసినట్టు ఫారెస్టు అధికారి రమణ మంగళవారం తెలిపారు. ఫారెస్టు సిబ్బంది, వన సేవకులు పాల్గొన్నారు.



పోలింగ్‌స్టేషన్ ఆవరణలో ఓటర్లకు మెక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం


ఎం కె.వల్లాపురం పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిరి